26

## ఉగ్ర పర్యావరణం

మనిషి కళ్ళు తెరిచాడు-

సకల జీవరాసులూ అతని చుట్టూ చేరి ఎంతో ఆప్యాయంగా చూశాయి!

"ఈ చల్లని నీళ్ళు నీకోసం తెచ్చాను"- అంది సెలయేరు.

"ఈ తియ్యని పళ్ళు నీకోసం తెచ్చాను"- అంది చెట్టు.

"జీవితాంతం మా పాలు తాగి వృద్ధిలోకిరా"- అన్నాయి ఆవులు, గేదెలు....

"వ్యవసాయంలో మా సాయం తీసుకో"- అన్నాయి ఇతర పశువులు.

"ఔషధ మూలికలన్నీ నీవే. కలపంతా నీదే. బొగ్గూ నీదే"- అంది అరణ్యం.

"శోధించు. నాలో నీకు దొరకని దంటూ లేదు"- అంది హోరు తగ్గించి సముద్రం.

"అన్వేషించు నాలో నీకు తెలియని రహస్యమంటూ ఉండదు" -అంది అంతరిక్షం.

మనిషి ఆలోచనలో పడ్డాడు-

భయం భయంగా, బితుకు బితుకుగా అన్నిటి నుండి అన్నీ పొందడం ఆరంభించాడు. కాలం గడుస్తున్న కొద్దీ అతనిలో ఆత్మ విశ్వాసం పెరిగింది. ఆత్మ విశ్వాసంలో పరిశీలన, పరిశోధన పలి పలి విధాల సాగింది. ఆత్మ విశ్వాసం క్రమంగా అహంకారంగా మారింది.

"ఏయ్ సెలయేరు నీళ్లేమిటి, మురికిగా ఉన్నాయి?"- అని గద్దించాడు మనిషి.

"ఓసి వృక్షమా! నీ పళ్లేమిటి, తగ్గిపోతున్నాయ్?"- అని హుంకరించాడు మనిషి.

"ఛీ ఛీ! గాలీ, నువ్వెక్కడి నుండి వీచుకుంటూ వస్తున్నావ్"- అని విసుక్కున్నాడు మనిషి.

జీవ రాసులన్నీ తన ప్రాముఖ్యాన్ని సమర్థిస్తున్నాయని, మనిషికి తన మీద తనకే గొప్ప అభిమానం పెరిగింది. పరిసరాలను మరిచి, మనిషి తనను తానే ప్రేమించుకోవడం మొదలు పెట్టాడు.

"నమ్మిన గొర్రె మెడ మీద కత్తివేటు వేయకపోతే, తను మనిషే కాదు. లొంగిన ఆడదాని బతుకు బుగ్గి చేయకపోతే తను మనిషే కాదు. తోటి వాణ్ణి వెన్నుపోటు పొడవకపోతే తను మనిషే కాదు. కష్టపడి జాగ్రత్తగా ఇసుకతో పిచ్చుక గూళ్ళు కట్టి, తొక్కి-చిందర వందర చేయకపోతే తను - - -" అని అనుకున్నాడు మనిషి! ఇదే సిద్ధాంతం అన్నిటికీ అన్వయించడం ప్రారంభించాడు.

వెన్నుపోటు ప్రారంభమైంది.

అడవిలో క్రూర మృగాలెన్ని ఉన్నాయ్? లెక్కలు గట్టాడు. కొన్నిటిని సరదాగా వేటాడి ఆనందించాడు. వాటితోళ్ళు ఒలిచి సూట్లు కుట్టించుకున్నాడు. పాముల విషాలు సైతం మందు చేసుకు తాగాడు. పులుల్ని పిల్లులుగా చేశాడు. ఏనుగులతో గాడిద చాకిరి చేయించుకున్నాడు. శాంపిల్‌గా కొన్నిటిని జంతు ప్రదర్శన శాలలో కటకటాల వెనక పారేశాడు. స్వాభావికతను బంధించి, కృత్రిమత్వాన్ని నెత్తికెత్తుకున్నాడు.

సముద్రాల్ని గిల కొట్టాడు. నదుల దారి మళ్లించాడు. మేఘం వర్షించనంటే, వెళ్లిపొమ్మని కృత్రిమ వర్షం కురిపించుకున్నాడు. ఒక చిన్న కీటకపు హృదయ నిర్మాణం నుండి విశ్వాంతరాళంలోని రసాయ

నిక చర్యలదాకా పసిగట్టాడు. అయితే ఎటొచ్చీ అన్నీ తన స్వార్థానికే ఉపయోగించుకోవడం మానలేదు.

మట్టి పొరల్లో పూర్వీకుల గోత్రాలు తవ్వి తీశాడు. దేవుడి నిజ స్వరూపం, బట్టబయలుచేసే యత్నం మానలేదు. ప్రకృతికి విరుద్ధంగా గర్భంలోని జీవాన్ని పరీక్ష నాళికలో నిలిపాడు. ఎడారిలో పంటలు పండించాడు. సముద్ర గర్భంలో దాక్కున్నాడు. మేఘాల మాటున ఉండి ఇంద్రజిత్తులా బాంబులు కురిపించాడు. చెట్ల గొంతులు కస కసా కోశాడు. ఫ్యాక్టరీ గొట్టాలు నిలిపాడు. నాగరికంగా కాంక్రిట్ గార్డెన్‌లు పెంచాడు.

"నిన్ను నీవు మరిచి పోవద్దు. నీ హద్దులు మరిచి పోవద్దు"- అని అంటూనే ఉంది భూమి తల్లి.

"మానవా! నీ ప్రతిభ, పిచ్చివాడి చేతిలోని రాయి కాకూడదు సుమా"- అని హెచ్చరించింది వాతావరణం.

మనిషి వాటిని పెడ చెవిని పెట్టాడు-

* * *

ఒకనాడు మనిషిని అతి సుకుమారంగా పెంచుకున్న ప్రకృతి, ఈనాడు, పెరిగిన మనిషి ముందు తల వంచుకోవాల్సి వచ్చింది.

తన కొమ్మ తానే కొట్టుకున్నట్టు, తన రెక్క తానే విరుచుకున్నట్టు, తన గొంతు తానే కోసుకున్నట్టు, తన గుండె తానే పిసుక్కున్నట్టు, తన సమాధి తానే కట్టుకున్నట్టు, మనిషి- విశ్వరూపం ప్రదర్శించాడు! మనిషి తన రాక్షస ప్రవృత్తిని విశ్వమంతా చాటాడు!! బిగుసుకునే ఆక్టోపస్ టెంటకిల్స్‌లా, మనిషి స్వార్థం అర్థంలేకుండా పెరిగి పెరిగి బిగుసుకుంటోంది.

ఇప్పుడు మారిన పరిస్థితులను బట్టి చూస్తే, మనిషి విధ్వంసకుడయ్యాడు. ఛండశాసనుడయ్యాడు.

జంతువులు, అరణ్యాలు, నదులు, సముద్రాలు, అంతరిక్షంతో సహా అన్నీ తల్లడిల్లి పొయ్యాయి. మనిషిని తలదన్నే వాడెవడైనా వుంటే, అన్నీ కలిపి, వాడికి మొరపెట్టుకుందా మనుకున్నాయి. బ్రహ్మ, విష్ణు మహేశ్వరులంతా గుళ్ళు కట్టుకుని సెటిలై (శిలలై) పొయ్యారు. క్రీస్తు శిలువయ్యాడు. అల్లామియా మసీదు గోడగా మిగిలాడు-

ఎవరు రక్షించాలి ప్రకృతిని?

ఎవరు రక్షించాలి మానవుడిని?

నీటిలో చేపా, కప్పా, తల్లడిల్లిపొయ్యాయి. గాలిలో పక్షి రెక్కాడించకుండా నిశ్చేష్టురాలయ్యింది- క్రూర జంతువులు తమ నైజం మరిచాయి, చెట్టు ఆకు కదిలించలేదు.

మనిషి తనను తాను తెలుసుకునే దాకా సహాయ నిరాకరణోద్యమం చేపట్టాలని- అన్నీ కలిసి తీర్మానించుకున్నాయి. మనిషిని బహిష్కరించడానికి అది ఒక ఆరంభం.... సమృద్ధిగా దొరికిన నీరు, అన్వేషిస్తేగాని దొరకలేదు. ఆ తర్వాత కొంత కాలానికి నెత్తిగోక్కుని జుట్టు పీక్కున్నా దొరక లేదు.

లేమి విశ్వరూపం చూపించింది-

కొత్త జీవులు, కొత్త వ్యాధులు, కొత్త సమస్యలు బుయ్ః.... మని చుట్టుముట్టాయి.

మనిషికి ఊపిరి ఆడలేదు-

తనెంతటి అల్పుడు?

తనెంతటి మూర్ఖుడు?

తనెంతటి బలహీనుడు?

తనెంతటి క్రిమి?

ఆడిందల్లా ఆట, పాడిందల్లా పాట కావడం లేదు. ఇప్పటి దాకా భూమి మనిషిని కాపాడుకుంటూ వచ్చింది. ఇక ఇప్పుడు,

మనిషి భూమిని కాపాడు కోవాల్సి ఉంది. ధరిత్రి సదస్సు తప్పదు - అంతర్జాతీయ అవగాహనా తప్పదు -

గాలిలో ఎప్పటికప్పుడు కొత్తవైరస్‌ల ముఖాలు వెక్కిరిస్తున్నాయేమిటి? విద్యుచ్ఛక్తి అణుశక్తి భూతాల్లా భయపెడుతున్నాయేమిటి? మూలకాల కలయికల్లో కొత్త మూలుగులు వినిపిస్తున్నాయేమిటి?

ఎక్కడైనా దృష్టి లోపం - జరిగి పోయిందా?

పక్క దేశం, పక్క రాష్ట్రం, పక్క ఊరు, పక్క మనిషి తత్వం, అంతా శత్రుప్రాయంగా.... తోస్తూ ఉంటుందేమిటి?

వైఫల్యాలు ఎక్కువైన కొద్దీ, మనిషి తన నీడకు తానే భయపడడం మొదలు పెట్టాడు - 'నేనెవరు? నేనెవరూ?' అని తరతరాలుగా సందేహం వెలిబుచ్చుతూనే ఉన్నాడు. దేవుడు, వేదాతం, మనస్తత్వ శాస్త్రం,సామాజికశాస్త్రం, జీవశాస్త్రం అన్నిటినీ ఆశ్రయిస్తూనేఉన్నాడు.

బయలుదేరిన చోటునుండి, భూగోళమంతా చుట్టి వస్తే గుండ్రంగా మళ్ళీ అక్కడికే రావొచ్చు - అలాగే, మనిషి పరిశోధన ఒక వృత్తం. మనిషి ప్రయాస ఒక వృత్తం. మనిషి జీవితం ఒక వృత్తం. ప్రారంభంలోనే ముగింపు. ముగింపులోనే ప్రారంభం. ఒక్కోసారి ఆ వృత్తం, మనిషి ఉనికి శూన్యమని వెక్కిరిస్తూ ఉంటుంది. అయినా సరే, శూన్యంలోనే ఏదో ఒకటి, అన్వేషించడం మానలేదు మనిషి!

యుద్ధరంగంలో మిగిలిన ఒంటరి వీరుడిలా మనిషి, ఎప్పటికప్పుడు గత వైభవాన్ని తలచుకుంటూ సాగుతూనే ఉన్నాడు.

అన్నీ ఉండి, ఏదీ లేనివాడిలా తిరుగుతూనే ఉన్నాడు.

ప్రకృతిలో భాగంగా ఉండాలా లేక తానే ప్రకృతై పోవాలా? తేల్చుకోలేక పోతున్నాడు.

- మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతూనే ఉన్నాడు.

○

అక్టోబర్, 1992